సన్నూరులో శ్రీవారికి ప్రత్యేక పూజలు

రాయపర్తి, ఫిబ్రవరి 25: మండలంలోని వేంకటేశ్వరపల్లిలో చారిత్రక స్వయం వ్యక్త శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (సన్నూరు)లో నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక అధ్యయన బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవితో శనివారం రాత్రి శ్రీవారి తిరుకల్యాణోత్సవం – తలంబ్రాలు నిర్వహించిన నేపథ్యంలో ఆదివారం పరిణయ పట్టు వస్త్రాల్లో ఉన్న సతీసమేత శ్రీవారికి ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి, ఆలయ అనువంశిక పూజారులు, ఉత్సవ కమిటీల సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీ సమేత శ్రీనివాసుడు దేవరాజవాహనం, గరుడ వాహనాలపై మంగళవాయిద్యాలు, మంగళహారతులు, భక్తుల జయ జయ ధ్వానాల నడుమ వేంకటేశ్వరపల్లి, ఆలయ పరిసరాల్లో ఊరేగడంతో గ్రామ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి.

దేవరాజ వాహనంపై స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు

మల్లూరు ఆలయంలో ఎమ్మెల్సీ సారయ్య పూజలు

మంగపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయన ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం, చైర్మన్ నూతిలకంటి ముకుందం స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో నిర్వహించిన తైలాభిషేక పూజాక్రతువులో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసాచారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భాలయం ఎదుట ఎమ్మెల్సీ దంపతులు

'అగ్రం పహాడ్' హుండీల తరలింపు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 : అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ దేవతల వద్ద ఏర్పాటు చేసిన 50 హుండీలను పరకాల ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈవో శేషగిరి, జాతర కమిటీ చైర్మన్ శీలం రమేశ్ సమక్షంలో వరంగల్ బట్టల బజార్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి తరలించారు. పోలీసుల బందోబస్తు నడుమ హుండీలను తరలించినట్లు ఈవో తెలిపారు. అలాగే, అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. తల్లులు వన ప్రవేశం చిసిప్పటికీ భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పటి వరకు 25 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఎండోమెంట్ అధికారులు తెలిపారు.

హుండీలను తరలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

హుండీ ఆదాయం లెక్కింపు

వేలేరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎర్రబెల్లి సమ్మక్క-సారలమ్మ జాతర హుండీ ఆదాయాన్ని ఆదివారం జాతర నిర్వహకులు లెక్కించారు. నిర్వాహకుడు కాలేరు చినబాబు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా, రూ.77,878 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఐనవోలు మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

ఐనవోలు, ఫిబ్రవరి 25: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం వారాంతపు జాతరకు భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు వచ్చి ఆలయ ప్రాంగణంలో విడిది చేయగా జాతర ప్రాంగణం కిటకిటలాడింది. ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిది చేసి పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాలు వేసి పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చాలని కోరుకుంటూ పరాలు పట్టి వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టజెప్పారు. మరికొందరు స్వామివారికి రథసేవ చేశారు. వారాంతపు జాతరలో స్వామివారికి అభిషేకాలు, కల్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో పట్నం వేస్తున్న భక్తులు

రథసేవలో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ధర్మసాగర్, ఫిబ్రవరి 25 : మండలంలోని ధర్మసాగర్, శాయిపేట, నారాయణగిరి సబ్‌స్టేషన్లకు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ రూరల్ డీఈ సౌమ్యనాయక్, ధర్మసాగర్ ఏఈ బస్కే సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలుకుర్తి గ్రామంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు. తిరిగి రాత్రి 9గంటల నుంచి యథావిధిగా సరఫరా చేస్తామని వివరించారు.

టాటా ఏస్, ట్రాక్టర్ ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

కరీమాబాద్, ఫిబ్రవరి 25 : నగరంలోని మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి నక్కలపల్లిలో ఆదివారం టాటా ఏస్, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దామెర సుదర్శన్, గుగులోత్ రమేశ్ తీవ్ర గాయాలయ్యాయి. సుదర్శన్ టాటా ఏస్ వాహనంలో ఇరుక్కుపోగా 108 సిబ్బంది చేరుకొని స్థానికులతో కలిసి అతడిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. 108 సిబ్బంది క్రాంతికుమార్, చంద్రసేన క్షతగాత్రులను ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

దామెర, ఫిబ్రవరి 25 : మండలంలోని ఊరుగొండ సమీపంలో ట్రై సైకిలిస్టును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి డిపో బస్సు ములుగు రోడ్డు నుంచి గూడెప్పాడ్ వైపు వెళ్తున్నది. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన అచ్చునూరి ఐలయ్య ట్రై సైకిల్‌పై అదేమార్గంలో వెళ్తున్నాడు. సైకిలిస్టును తప్పించబోయిన ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టింది. బస్సులో 15మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రై సైకిలిస్టు కింద పడిపోగా చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న బీసీఐ అమెరికా ప్రతినిధి కార్ని

సేంద్రియ కర్బనంతో మేలు

శాయంపేట, ఫిబ్రవరి 25 : సేంద్రియ కర్బనం వల్ల భూమికి మేలు జరుగుతుందని బీసీఐ అమెరికా ప్రతినిధి కార్ని అన్నారు. మండలంలోని కొత్త గట్టుసింగారం, గంగిరేణిగూడెం గ్రామాల్లో రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టు కార్యక్రమాలను వాతావరణ మార్పు ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్యతో కలిసి ఆదివారం పరిశీలించారు. మహిళలు తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు యూనిట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, రామ్మూర్తి, శ్రీనివాస్, ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

'సైనికుల్లా పనిచేయాలి'

శాయంపేట, ఫిబ్రవరి 25 : ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేయాలని కిసాన్ మోర్చా భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పొలసాని తిరుపతి రావు అన్నారు. శాయంపేటలో పార్టీ కార్యాలయంలో విజయ సంకల్ప యాత్ర సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. 29న రేగొండలో జరిగే విజయ సంకల్ప యాత్రకు మండలం నుంచి కార్యకర్తలను తరలించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ఎమ్మెస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలో ఎమ్మెస్పీ మండల కన్వీనర్ ఆకారపు రాజు ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 4వ తేదీన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ పార్లమెంట్ స్థాయి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు భిక్షపతి, పవన్ పాల్గొన్నారు.

పర్వతాల శివాలయం ఉత్సవాలను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, పర్వతాల శివాలయం ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం పర్వతాల శివాలయాన్ని దర్శించుకుని మాట్లాడారు. శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు. మండలంలోని ప్రజలందరూ హాజరు కావాలని కోరారు. మార్చి 7న తాడు గుంజుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30, తృతీయ బహుమతిగా రూ.20వేలు, నాలుగో బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గ్రామాలవారీగా పది మంది జట్టు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మార్చి 8న శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. వేడుకలను పురస్కరించుకుని శివాలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రంగు కుమార్, సంపెల్లి వేంకటేశ్వర్‌రావు, కొమురయ్య, ఆలయ సిబ్బంది అశోక్, పుష్ప, భాస్కర్ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

మాతృభాషను కాపాడుకోవాలి : బన్న ఐలయ్య

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని బీఈడీ కళాశాల ఆడిటోరియంలో ఉదయ సాహితీ సాహిత్య వికాస వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలు అంతరించిపోతున్నాయని, భాష అంతరిస్తే జాతి కూడా అంతరించినట్లేనని అన్నారు. ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై తెలుగుభాషను పరి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఉదయ సాహితీ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షురాలు వకుళవాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీలేఖ సాహితీ అధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీరంగస్వామి, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి బిల్ల మహేందర్, ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు ఏడెల్లి రాములు, నగునూరి రాజన్న, వకుళాభరణం శివరంజని, మెరుగు అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీ విజేతలకు బహుమతులను ప్రదానం చేసి, వారిని సన్మానించారు.

మాట్లాడుతున్న ఆచార్య బన్న ఐలయ్య

'ముదిరాజ్‌లను బీసీ 'ఏ' లోకి మార్చాలి'

కాజీపేట, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తులకు సరైన రిజర్వేషన్ లేదని, బీసీ డీ గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. కాజీపేటలోని మెపా జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నూనె శివకుమార్, అమ్మగారి శ్యాం సుందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా సతీశ్, గోనెల విజేందర్, సంయుక్త కార్యదర్శిగా దండు గంగాధర్, అంబటి కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ముదిరాజుల రిజర్వేషన్ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టకుంటే మెపా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. మెపా రాష్ట్ర నాయకులు బోనాల రమేశ్, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, కాజీపేట మండలాధ్యక్షుడు కనుకుంట్ల రవి, గోనెల విజేందర్, దొంతరబోయిన మహేశ్, దండు చిరంజీవి, సార సతీశ్, పెండ్యాల కృష్ణ, సింగారపు మహేశ్ కుమార్, వినోద్, శ్యాం, దిలీప్, రాకేశ్ వర్మ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాజీపేట : సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

ముదిరాజ్‌ల అభ్యున్నతికి మెపా కృషి

నర్సంపేట రూరల్ : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్రంలో ముదిరాజ్ జాతి అభ్యున్నతికి నిస్వార్థంగా పనిచేస్తుందని మెపా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్ తెలిపారు. నర్సంపేట డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెపా పేరును కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని, అలాంటి వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. డివిజన్ కన్వీనర్ యాదగిరి మాట్లాడుతూ మెపా బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పిట్టల కుమార్, చిరంజీవి, నిమ్మనబోయిన అశోక్, మహేందర్, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే చిత్రాలు నిర్మించాలి

కాజీపేట, ఫిబ్రవరి 25 : సమాజానికి ఉపయోగ పడే సినిమాలను నిర్మించాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. కాజీపేట పట్టణం 61వ డివిజన్‌లోని తెలంగాణ చౌరస్తా సమీపంలో ఆదివారం ఇంద్రజిత్ సినీ ప్రొడక్షన్ హౌస్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి 'తల పోసిన తలంబ్రాల సాక్షిగా' పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంబయ్య నాయక్, వాన్య అగర్వాల్, దిలీప్ దేవగన్, మోహన్ మర్రిపల్లి, కిషన్ రాయ్ పాల్గొన్నారు.

పాటలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్

మాందారిపేట వైపు బీటీ వేయకుండా వదిలేసిన రోడ్డు

కాట్రపల్లికి వైపు వర్షాలకు కొట్టుకుపోయిన బీటీ రోడ్డు

ఆర్నెళ్లు దాటినా రోడ్డు పనులు పూర్తి చేయలే..

- రూ.1.80 కోట్లతో బీటీ పనులు
- పట్టించుకోని అధికారులు

శాయంపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని మందారిపేట స్టేజీ నుంచి తహరాపూర్ గ్రామం మీదుగా పోచారం వరకు బీటీ రోడ్డు పనులు జరిగాయి. ఆర్‌అండ్‌బీ శాఖ రూ.1.80కోట్లతో ఆరు కిలోమీటర్ల మేర నూతన బీటీ రోడ్డు పనులు చేపట్టింది. అయితే కాంట్రాక్టర్ ఆర్నెళ్లు దాటినా కల్వర్టుల వద్ద బీటీ రోడ్డు వేయలేదని, కంకరతేలి ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. మాందారిపేట శివారులో కల్వర్టు వద్ద బీటీ వేయకపోవడం సమస్యగా మారిందంటున్నారు. అలాగే ప్రగతిసింగారం నుంచి కాట్రపల్లికి వెళ్లే రోడ్డు నాణ్యత లేకపోవడంతో పలు చోట్ల బీటీ పోయిందని గ్రామస్తులు చెప్పారు. భారీ వానలు పడటంతో సుమారు రెండు వందల మీటర్ల బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. అధికారులు కొత్త బీటీ వేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోకపోవడంతో కష్టాలు పడుతున్నట్లు గ్రామస్తులు చెప్పారు.

పనులు చేశాకే బిల్లులు చెల్లిస్తాం

మాందారిపేట నుంచి బీటీ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. ఆర్నెళ్లుగా పెండింగ్ ఉన్నది నిజమే. పోచారం వద్ద రోడ్డు డ్యామేజీ అయిందని, మరమ్మతు చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. మరికొన్ని చోట్ల కల్వర్టుల వద్ద బీటీ వేయాల్సి ఉంది. అందుకే బిల్లులు పెండింగ్‌లో పెట్టాం. అన్ని పనులు పూర్తి చేశాకే బిల్లులు ఇస్తాం.

– గోపి, ఆర్‌అండ్‌బీ ఏఈ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ప్రతిభతో పతకాలు సాధించాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : క్రీడాకారులు తమ ప్రతిభతో పతకాలు సాధించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. రాము మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 50 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, విజేతగా నిలిచిన జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి అందజేస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు, జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు తెలిపారు. ఒయాసిస్ విద్యాసంస్థ అధినేత పరంజ్యోతి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, రాము కుటుంబ సభ్యులు కరణ్, మనీష్, విక్రమ్‌రావు, అక్షిత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్

ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశంలో అరూరి రమేశ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలో గులాబీ జెండా ఎగరాలని జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి మెజారిటీ వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 29న వర్ధన్నపేటలో నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి

నియామకంపై టీయూడబ్ల్యూజే హర్షం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిని నియమించడంపై టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, గుంటి విద్యాసాగర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, పిన్నా శివకుమార్, పీవీ మదన్‌మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల మేడారం పర్యటన సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ప్రకటించారని కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

కరీమాబాద్, ఫిబ్రవరి 25: రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ తోటలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ బండి అవినాశ్ తెలిపారు. విశ్వం లాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలోనూ దాసి సాయిమన్విత్, ఇతర విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో బహుమతి గెలుపొందారని తెలిపారు.

బహుమతి అందుకుంటున్న సాయిమన్విత్

గజ్జెల రాజ్‌కుమార్‌శాస్త్రికి జ్యోతిదర్ సావిత్రి అవార్డు ప్రదానం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: వరంగల్ కొత్తవాడకు చెందిన జ్యోతిష్య పండితుడు, డాక్టర్ గజ్జెల రాజ్‌కుమార్‌శాస్త్రికి ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'జ్యోతిదర్ సావిత్రి' అవార్డును ప్రదానం చేశారు. తమిళనాడులోని ఆరంబాక్కంలో ఆస్ట్రాలజికల్ కాన్వొకేషన్ సందర్భంగా అవార్డును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిష్య గొప్పదనం, నైపుణ్యం, శాస్త్రీయ విధానాన్ని గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్ దివ్య పిళ్లై, పలువురు పండిత విద్వాంసులు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్‌శాస్త్రి

అంధుల పాఠశాలలో అన్నదానం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: వరంగల్ ఆటోనగర్‌లోని లూయీస్ ఆదర్శ అంధుల పాఠశాలలో యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం అన్నదానం చేశారు. జిల్లాకు చెందిన నుగూరి లక్ష్మినారాయణ-రమాదేవి దంపతుల కుమారుడు సాయికృష్ణ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులందరికీ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్త కొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్ల కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోలా రాజేశ్, ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వీ, రాజ్‌కుమార్, రాంప్రసాద్, సృజన, జ్యోతి, భావన యాకయ్య, విష్ణు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పరస్పర సహకారంతోనే ఆర్థికాభివృద్ధి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 25 : సభ్యుల పరస్పర సహకారంతోనే ఆర్థికాభివృద్ధి సాధిస్తామని ముల్కనూరు పురుషుల పొదుపు సమితి-1 అధ్యక్షుడు జాన ప్రవీణ్ అన్నారు. ఆదివారం ముల్కనూరులో సంఘం-4 ఐదో వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మురళీకృష్ణ సభ్యులకు వార్షిక నివేదిక చదివి వినిపించారు. అనంతరం ముఖ్య అతిథిగా ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐదోసారి బొజ్జపురి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గుడికందుల కిశోర్ మూడోసారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నీలం భిక్షపతి, పోలు రాజుకుమార్, ఎల్తూరి ప్రభాకర్, కొండా వెంకటేశ్వర్లు, అప్పని భిక్షపతి, సాదిక్‌పాషా, రాపెల్లి సదానందం, పుల్ల రాంకుమార్, గొల్లెన కుమారస్వామి, పంగరెక్క విజయ్‌గాంధీ, వంగ సదానందం, గొల్లపల్లి శేఖర్, రాపెల్లి రాజు, మంగ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted PRO's for Degree and Junior College Admissions (20 years Experience) Cont: **8121554649, 9391660036.** NTW-323172

★Urgent Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND Bank's Loans. Need Exp. & Fresher Female Tele-Callers, Sal+Inc. etc., Job Location: HNK, Cont: **+91 8712312528.** NTW-5693

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319443

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జ